www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 13 ఆగస్టు 2023 5

ఏలూరు



# రాజ్యాంగ పరిరక్షణ కీలకం

## ఐలు జిల్లా కార్యదర్శి రాజారావు

ప్రజాశక్తి - భీమడోలు

రాజ్యాంగ పరిరక్షణ ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడుకోగలమని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా కార్యదర్శి పి.రాజారావు అన్నారు. గుంటూరులో రెండు రోజులపాటు సాగే ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని భీమడోలు కోర్టు వద్ద ఆయన శనివారం ఉదయం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల్లో రాజ్యాంగ రక్షణ కోసం, లాయర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్చించి తీర్మానాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు జివి.ప్రసాద్‌బాబు, పి.శ్రీనివాస్, ఎ.గంగాధర్‌రావు, పి.బాలాజీ, టి.వికాస్ పాల్గొన్నారు.

# కొబ్బరి కొనేదెవరు..!

**జిల్లాలో కొబ్బరి సాగు చేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పండించిన పంటను కొనేవారు లేక, గిట్టుబాటు ధర దక్కక దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కొబ్బరిపై కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులను కోలుకోలేకుండా చేస్తున్నాయి. రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో కొబ్బరి సాగవుతున్నా ఆ రైతుల గురించి ప్రజాప్రతినిధులుగాని, అధికారులుగాని పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ కొబ్బరి రైతులు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే కొబ్బరి రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోనున్నారు.**



- తీవ్ర ఇబ్బందుల్లో కొబ్బరి రైతులు
- రెండు జిల్లాల్లో 50 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు
- కొనుగోలు కేంద్రాలు లేక దక్కని గిట్టుబాటు ధర
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొబ్బరి సాగులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. విభజిత ఏలూరు జిల్లాలో 35 వేల ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 15 వేల ఎకరాల్లో మొత్తంగా రెండు జిల్లాల్లో 50 వేల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. రైతులు ప్రతియేటా పెద్దఎత్తున కొబ్బరి పండిస్తున్నప్పటికీ అధికారులుగాని, ప్రజాప్రతినిధులుగాని కొబ్బరి రైతుల గురించి పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం రైతుకు కొబ్బరికాయకు దక్కే ధర రూ.ఏడు మాత్రమే. మార్కెట్లో మాత్రం రూ.15కు పైగా అమ్ముతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కకపోగా కొనుగోలుదారునికి కూడా ఉపశమనం లేకుండాపోయింది. దళారులే రాజ్యమేలుతున్న పరిస్థితి ఏర్పడింది. ఎకరా కొబ్బరి సాగులో దాదాపు 50 నుంచి 55 చెట్లు ఉంటాయి. గతంలో చెట్టు కాయలు తీసుకునేందుకు ఏడాదికి రూ.1200 వరకూ చెల్లించేవారు. ఇప్పుడు దళారులంతా కుమ్మక్కై చెట్టుకు రూ.600 మాత్రమే ఇస్తామని చెబుతున్న పరిస్థితి ఉంది. ఖర్చులు తక్కువగా ఉన్నప్పుడు ధర ఉండేది. ఖర్చులు పెరిగిన తర్వాత ధర తగ్గిపోవడంతో రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారు. ఎకరా కొబ్బరి సాగుకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి అవుతోంది. కాయలు తీసి గుట్టగా వేయడానికి కాయకు దాదాపు రూ.మూడు ఖర్చవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కాయ ధర రూ.15 ఇస్తే తప్ప రైతులకు గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేకుండాపోయింది. 1992లో కాయ ధర రూ.ఐదు పలికితే సుమారు 30 ఏళ్ల తర్వాత ఇప్పుడు కాయకు రూ.ఏడు ఇస్తే ఏవిధంగా గిట్టుబాటు అవుతుందో ప్రభుత్వం చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. అయితే కొబ్బరి రైతులను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొబ్బరికి గత కొన్నేళ్లుగా తెల్లదోమ, ఎర్రమల్లి వంటి తెగుళ్లు సోకుతున్నాయి. వీటి నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో రైతులకు చెప్పే నాథుడే లేకుండాపోయాడు. జిల్లాలో ఇంత పెద్దఎత్తున కొబ్బరి సాగు సాగుతున్నా కొనుగోలు కేంద్రాలు లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొబ్బరి రైతులకు న్యాయం చేయాలంటూ ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం చలో కలెక్టరేట్‌కు పిలుపు ఇవ్వడం ప్రస్తుత పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా కొబ్బరి రైతుకు అండగా నిలవాలని అంతా కోరుతున్నారు.

### కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**బొబ్బా రమేష్, కొబ్బరి రైతు, ఆంజనేయ నగరం, భీమడోలు మండలం**



ఎనిమిదెకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నాను. గతంలో చెట్టుకు రూ.1200 వచ్చేవి. ఇప్పుడు రూ.600కు అడుగుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతుంటే కొబ్బరి ధర తగ్గిపోతుంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పిస్తేనే కొబ్బరి రైతులకు న్యాయం జరుగుతోంది. లేకపోతే కొబ్బరి సాగు నుంచి రైతుల తప్పుకునే పరిస్థితి రానుంది.

### తెగుళ్లు సోకినా పరిష్కారం చెప్పే నాథుడే లేడు

**పానుగంటి అచ్యుతరామయ్య, చొదిమెళ్ల**



కొబ్బరి సాగును తెల్లదోమ, ఎర్రమల్లి వంటి తెగుళ్ల దెబ్బతీస్తున్నాయి. వీటి నివారణా చర్యలు గురించే చెప్పే నాథుడే లేకుండా పోయాడు. ప్రస్తుతం కొబ్బరి కాయ ధర రూ.ఏడు పలుకుతోంది. కాయ ధర రూ.15 లేకపోతే రైతుకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతోంది. కొబ్బరి రైతు గురించి ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం ఆవేదన కల్గిస్తోంది.

### కొబ్బరి రైతును దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు

**కె.శ్రీనివాస్, రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి**



విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులను కేంద్రం వెంటనే ఆపాలి. కొబ్బరి రైతుకు సరైన ధర కల్పించే విధంగా నాఫెడ్, ఆయిల్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి. కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలి. ధరల స్థిరీకరణ పథకాన్ని కొబ్బరికి వర్తింపచేయాలి. కొబ్బరి రైతుల సమస్యను పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.



కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న ఫ్యాప్టో నేతలు, ఉపాధ్యాయులు

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఫ్యాప్టో ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద 12 గంటల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఎస్‌ను రద్దు చేయాలని, విద్యారంగ సమస్యల పరిష్కరించాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు స్థానిక కలెక్టరేట్ వద్ద శనివారం 12 గంటల నిరసన ధర్నా నిర్వహించారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పివిబిఎన్ఎల్.నారాయణ, సెక్రటరీ జనరల్ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ధర్నాలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆందోళనకు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అధికారంలోకొచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. వెంటనే సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పాఠశాలల విలీనం కోసం విడుదల చేసిన జిఒ 117ను రద్దు చేసి విద్యా వ్యవస్థను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో పోరాటాలకు తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఫ్యాప్టో రాష్ట్ర కోఛైర్మన్ బి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానం, మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీనంతో పాఠశాలల్లో విద్యార్థులు లేక తరగతి గదులు వెలవెలబోతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగులో ఉన్న 60 వేల మంది ఉపాధ్యాయుల రెండు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని, 12వ పిఆర్‌సి కమిషనర్ మన్మోహన్‌సింగ్ ఇంతవరకు ఛార్జి తీసుకోలేదని, తక్షణమే మార్కెట్ ధరలకు అనుగుణంగా 50 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలలకు 010 హెడ్ జీతాలు, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, కస్తూర్బా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేస్తూ 30 శాతం వేతనాలు పెంచాలని, ప్రభుత్వంలో విలీనమైన ఉపాధ్యాయులకు భవిష్యనిధి, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మున్సిపల్ సర్వీస్ రూల్స్ ఆమోదింపజేసి బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కోశాధికారి పి.రామారావు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆర్.రవికుమార్, బిఎ.సాల్మన్‌రాజు, ఎస్‌కె.ముస్తఫాఆలీ, శ్రీనివాసరావు, సాయిరాజు, రెడ్డి దొర, కాంతారావు పాల్గొన్నారు.

# ఘనంగా ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్

ఎస్‌టిఎఫ్ఐ 24వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని బిజెపి పాలిత రాష్ట్రాలు అమలు చేయకపోయినప్పటికీ మన రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏకపక్షంగా అమలు చేస్తూ విద్యారంగంలో విధ్వంసాన్ని సృష్టిస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగంలో కాషాయీకరణ, వ్యాపారీకరణ, మతోన్మాద విధానాలను చొప్పించి తన రాజకీయ అజెండా అమలుకు ఏకపక్షంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. దీన్ని అనేక మంది విద్యావేత్తలు, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజాసంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ఏకపక్షంగా నూతన జాతీయ విద్యా విధానం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దీన్ని దేశవ్యాప్తంగా ఎస్‌టిఎఫ్ఐ భాగస్వామ్య సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యారంగ కార్పొరేటీకరణ, కాషాయీకరణ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగే పోరాటాలను జయప్రదం చేయాలని సాబ్జీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాలీ, ఆర్.రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి సుభాషిని, జిల్లా కోశాధికారి రంగమోహన్, కన్వీనర్ మోహన్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పివి.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు శివశంకర్రావు, సుధారాణి, కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొబ్బరి కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలి

## మొలకలు వచ్చిన కొబ్బరికాయలతో రైతుల నిరసన - 14న కొబ్బరి రైతుల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కొబ్బరి కొనుగోలు కేంద్రాలు వెంటనే తెరవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కొబ్బరి రైతుల సంఘం ఆధ్వర్యంలో మొలకలు వచ్చిన కొబ్బరికాయలతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలోని కొబ్బరితోటల్లో రైతులు నిరసన చేపట్టారు. కొబ్బరి రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కొబ్బరి రైతుల సమస్యలపై ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ధర్నా, జిల్లా కలెక్టర్‌కు రాయబార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతుల వల్ల కొబ్బరి ధర పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక్కో కొబ్బరి చెట్టుకు కొబ్బరికాయల కోతకు వ్యాపారులు రైతులకు సంవత్సరానికి రూ.వెయ్యి నుండి రూ.1200 ఇచ్చేవారని, ఇప్పుడు అది రూ.600 నుంచి రూ.700కు పడిపోయిందన్నారు. ఒక్కో కొబ్బరికాయకు రైతుకు రూ.6 నుండి రూ.7 మాత్రమే ధర ఇస్తున్నారని చెప్పారు. పెరిగిన ఖర్చుల రీత్యా ఒక్కో కొబ్బరికాయకు రూ.15 ధర ఇస్తేగాని రైతుకు గిట్టుబాటు కాదన్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతుల నుండి కొబ్బరికాయల కొనుగోలుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతు బొబ్బా రమేష్ మాట్లాడుతూ కొబ్బరి రైతులను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. కొబ్బరి రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, కొబ్బరి రైతులు మద్దిపాటి దుర్గారావు, బొబ్బా బాలాజీ, దండమూడి పార్థసారథి, బి.తేజ తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ సీలింగ్ భూములు పేదలకివ్వాలి

## ఎపి వ్యకాస ఆధ్వర్యాన గ్రామ సచివాలయం వద్ద ధర్నా



ధర్నాలో నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం రూరల్

కేతవరం గ్రామంలో ల్యాండ్ సీలింగ్ భూములు 120 ఎకరాలకు సంబంధించి పేదలకు పట్టాలు ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు జి.రాం బాబు అధ్యక్షతన జరిగిన ధర్నాలో జీవరత్నం మాట్లాడుతూ 1975లో ప్రభుత్వం సర్వే నెంబర్.417/2, 448/2, 444/2లో 37 ఎకరాల 66 సెంట్లు ల్యాండ్ సీలింగ్ భూములు 20 కుటుం బాలకు పట్టాలిచ్చారని, అయితే ఆ భూములను సాగు చేయకుండా భూస్వాములు అడ్డుపడుతున్నారని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములు అప్పగించాలని భూమిలోకి వెళ్తుంటే భూస్వాములు రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమ కేసు బనాయించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని వాపోయారు. ఈ గ్రామంలో మరో 80 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములు ఉన్నాయని, ఆ భూములు ప్రభుత్వం తక్షణమే సమగ్ర సర్వే చేసి పేదలకు పట్టాలివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు విద్య, వైద్యం, ఉపాధి చూపిస్తానని వాగ్దానాలు చేసిందని, పేదలకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. భూములు పంచాలని అనేకమార్లు కేతవరం గ్రామ విఆర్ఒ రమేష్, తహశీల్దార్‌కు దరఖాస్తులు పెట్టినప్పటికీ ఫలితం లేదని భూస్వాముల కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే భూపంపిణీలో ఈ 120 ఎకరాల ల్యాండ్ సీలింగ్ భూములకు పేదలకు పట్టాలివ్వాలని, లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు ఆ భూముల్లో సాగు చేస్తారని ప్రభుత్వాన్ని అధికారులను హెచ్చరించారు. ఈ ధర్నాకు మంచెల్ల ప్రభాకర్‌రావు, సుంద్రు దుర్గారావు, ఆడమిల్లి బ్రహ్మయ్య, ఏలపాటి దుర్గారావు, లక్కబత్తుల వెంకటేష్, చింతలపూడి సుబ్బారావు, వాముశెట్టి నర్సరావు, జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు నాయకత్వం వహించారు.

# కలెక్టర్ చొరవతో విద్యార్థికి ఉపశమనం..!

- అత్యవసర పరిస్థితుల్లో సెలవురోజు సర్టిఫికెట్ జారీ
- విద్యార్థికి ఫీజు రాయితీపై తొలగిన ఇబ్బందులు
- కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చొరవతో నిట్ కాలేజీలో సీటు సాధించిన విద్యార్థికి ఫీజు సమస్యలో అడ్డంకులు తొలగాయి. దీంతో ఆ తల్లిదండ్రులు ఆనందంతో కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొయ్యలగూడెం మండలం కన్నాపురానికి చెందిన దెయ్యాల శ్రీను కుమారుడు హరిచరణ్ రాజమండ్రిలో చదువుకున్నాడు. జెఇఇ మెయిన్స్‌లో మంచి ర్యాంకు రావడంతో కౌన్సెలింగ్‌లో త్రిపుర రాష్ట్రం అగర్తలలోని నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) కాలేజీలో సీటు వచ్చింది. సామాన్య కుటుంబానికి చెందిన విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఫీజు రాయితీ వర్తించాలంటే ఒబిసి సర్టిఫికెట్ జత చేయాలి. అవగాహనా లోపంతో ఆరు నెలల ముందు తీసుకున్న ఒబిసి సర్టిఫికెట్ జతచేయడంతో కాలేజీ యాజమాన్యం దాన్ని తిరస్కరించింది. శుక్రవారం రాత్రి కాలేజ్ నుంచి ఫోన్ చేసి శనివారం సాయంత్రంలోపు ఒబిసి ధ్రువపత్రం సమర్పించకపోతే ఫీజు రాయితీ వర్తించదని చెప్పడంతో హరిచరణ్ తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రెండో శనివారం సెలవు దినం కావడంతో తహశీల్దార్ వ్యక్తిగత పనుల నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లారు. దీంతో విద్యార్థి తండ్రి శ్రీనుకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. విషయం మీడియా ప్రతినిధులకు తెలియడంతో వెంటనే జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే తహశీల్దార్‌తో మాట్లాడి ఒబిసి సర్టిఫికెట్ ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. సెలవు రోజున సైతం విద్యార్థికి సర్టిఫికెట్ జారీకి మండలంలోని అధికారులు సైతం సహకరించడంతో విద్యార్థికి ఉపశమనం లభించింది. సెలవురోజు సైతం విద్యార్థికి అండగా నిలిచిన కలెక్టర్‌కు, అధికారులకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

# అసైన్డ్ చట్ట సవరణను రద్దు చేయాలి

**ఎపి వ్యకాస**

ప్రజాశక్తి - లింగపాలెం

అసైన్డ్, సీలింగ్ భూములను అన్యాక్రాంతం చేసిన వారి పేర్లు గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శించాలని, అసైన్డ్ భూముల చట్ట సవరణను వెంటనే రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేసి అనుభవిస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం మండలంలో భోగోలు, తోచిల కరాయుడుపాలెం, కలరాయనగూడెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు, అటవీ భూములకు పట్టాలివ్వలేదని విమర్శించారు. ఏళ్ల తరబడి పేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్, సీలింగ్ భూములకు సాగు పత్రాలు ఇవ్వాలని కోరారు. రాయుడుపాలెం, బాదరాల, వేములపల్లి, దిబ్బగూడెం, కళ్యాణపాడు గ్రామాల్లో దళితులు గత 25 ఏళ్ల నుండి అటవీ భూములను సాగు చేస్తూ వన సంరక్షణ సమితుల్లో ఉన్నారని తెలిపారు. అలాంటి వారికి సాగు పత్రాలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే పదేళ్లు గడిచినా నేటికీ అటవీ శాఖాధికారులు కొత్త ప్లాంటేషన్ ఇవ్వకపోగా పాత విఎస్ఎస్‌ల పంట కటింగ్‌కు వచ్చినా నేటికీ చేయలేదని విమర్శించారు. ఏళ్ల తరబడి పేదలను అటవీ శాఖ అధికారులు, భూస్వాములు బెదిరిస్తున్నారని మండిపడ్డారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవు తామని తెలిపారు. ఈ నెల 14న జిల్లా కలెక్టర్‌కు రాయబార కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

# ఈదురు గాలులు, భారీ వర్షం



ముదినేపల్లి రోడ్డుపై వర్షపు నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో శనివారం మధ్యాహ్నం ఈదురుగాలులు, భారీ వర్షం ప్రజలను వణికించాయి. ఉదయం నుంచి ఎండ తారెత్తించగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములతో వర్షం కురిసింది. గంటకుపైగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. వరుసగా రెండో రోజు కూడా వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో కురిసిన వర్షం ఎండిపోతున్న వరిపైరుకు జీవం పోసినట్లుగా ఉందని రైతులు చెబుతున్నారు.

# విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు




అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి విద్యార్థుల నివాళి

ప్రజాశక్తి - ఏలూరు

ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడినా, చర్చించినా, క్విజ్‌లో పాల్గొన్నా విద్యార్థుల అవగాహన పెరగడానికి దోహదప డుతుందని రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వై.ఆనందనాయుడు, ఇంగ్లీష్ రిటైర్డ్ లెక్చరర్లు డి.దిలీప్‌కుమార్, పి.ఆంజ నేయులు అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏలూరు పరిసర ప్రాంతాల హైస్కూల్ విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, కాలేజీ విద్యార్థులకు క్విజ్ పోటీ సుబ్బమ్మ దేవి హైస్కూల్లో శనివారం నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఈ నెల 15వ తేదీ సాయంత్రం కోటదిబ్బలోని సీతారామభర్తియా కళ్యాణ మండపంలో జరిగే సభలో బహుమతులు ప్రదానం చేస్తామని విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యురాలు జి.శారద తెలిపారు. 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు, మన్య విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వందో వర్ధంతి సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తృత్వ పోటీలకు డి.దిలీప్‌కుమార్, ఎబి.త్రిపురసుందరి, క్విజ్ పోటీలకు వై.ఆనందనాయుడు, వి.సురేష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.ఆంజనేయులు, ఎన్.గంగాభవాని, కె.లెనిన్‌బాబు నిర్వహించారు.

# మోడీ, జగన్‌లను ఇంటికి సాగనంపాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రాన్ని కాపాడండి, దేశాన్ని రక్షించండి అంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 17న విశాఖలో బస్సుయాత్ర ప్రారంభ మవుతుందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ తెలిపారు. , రాష్ట్రంలో 26 జిల్లాల్లో పర్యటించి వచ్చే నెల ఎనిమిదో తేదీన తిరుపతిలో భారీ బహిరంగ సభతో యాత్ర ముగుస్తుందన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వనజ మాట్లాడుతూ యాత్రను విశాఖపట్నంలో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ ప్రారంభిస్తారని, సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే ముగింపు సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారని తెలిపారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులైన అదాని, అంబానీలకు కారు చౌకగా కట్టబెట్టి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విభజన హామీలను అటకెక్కించి రాష్ట్రానికి మోడీ తీరని నష్టం చేకూర్చారని, రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్ కేంద్రాన్ని నిలదీయలేని అసమర్ధుడు అని ఎద్దేవా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ సిపిఐ ఆధ్వర్యంలో చేపడుతున్న బస్సుయాత్ర ఈ నెల 23న ఏలూరు జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా జంగారెడ్డిగూడెంలో జరిగే బహిరంగ సభ ను జయప్రదం చేయాలని కోరారు. 24న ఏలూరులో జరిగే రౌండ్‌టేబుల్ సమావేశానికి అన్ని రాజకీయ పక్షాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం నూజివీడులో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సమావేశంలో నేతలు బండి వెంకటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, జమ్మి శ్రీనివాసరావు, కంచర్ల గురవయ్య, కొండేటి బేబి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## స్నేహితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి



బాధితునికి సాయం అందిస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

రోడ్ ప్రమాదంలో రెండు కాళ్లు, ఒక చెయ్యి పూర్తిగా కోల్పోయి, ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇంటికి చేరుకున్న మిత్రుడు గుడెల్లి జగదీష్‌ను శనివారం అంబేద్కర్ యూత్ సభ్యులు పరామర్శించి ఆర్థికంగా సహకరించారు. జీలుగుమిల్లి గ్రామానికి చెందిన గుడెల్లి జగదీష్ నెల రోజుల క్రితం జాతీయ రహదారిపై రోడ్ ప్రమాదానికి గురై, మంగళగిరి ఆసుపత్రిలో చికిత్స పొందారు. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటం గమనించి శనివారం తోటి అంబేద్కర్ యూత్ సభ్యులు, జగదాంబ ట్రాలీ ఆటో యూనియన్ వారి సహాయంతో మొత్తం రూ.45వేలను తమ వంతు ఆర్థిక సహాయంగా అందజేసినట్లు యూత్ అధ్యక్షులు తలారి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఎటువంటి ఇబ్బంది వచ్చినా తమంతా కలిసి తమ వంతు సహాయం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, నాగేంద్ర, మనోజ్, జనార్ధన్ పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్గో అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌టిసి లైసెన్సు పోర్టర్స్ ఆర్‌టిసి కార్గో సంస్థ అభివృద్ధి కోసం అధికారులతో సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర కార్యదర్శి వేముల రాంబాబు సూచించారు. ఆర్‌టిసి లైసెన్స్ పోర్టర్స్ ముఖ్య నాయకుల సమావేశం శనివారం స్థానిక కొత్త బస్టాండ్, సంఘ కార్యాలయం నందు దాసిపల్లి కోటయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి వేముల రాంబాబు మాట్లాడుతూ కార్గో సంస్థ అభివృద్ధికి నిరంతరం కష్టించి పనిచేస్తున్న లైసెన్స్ పోర్టర్స్‌కు మరింత అవగాహన పెంపొందించేందుకు ఈ నెల 25వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశం జయప్రదానికి ప్రతిఒక్క పోర్టర్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లైసెన్స్ పోర్టర్స్ ఏలూరు గౌరవాధ్యక్షులు ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడారు. ఈ సమావేశంలో ఏలూరు లైసెన్స్ పోర్టర్స్ సంఘ నాయకులు తమ్మిశెట్టి రమణయ్య, గుంజే నాగరాజు, వేముల శ్రీను, తురక బక్కయ్య, వల్లెపు అబ్రహాం పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ బీమా రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ బీమాతో బాధితులకు కొంతమేర లబ్ధి చేకూరుతుందని చెక్కపల్లి ఉప సర్పంచి పద్మజా దేవేంద్ర తెలిపారు. మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన పస్తం వెంకన్న(33)లు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మరణించగా, రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ బీమా రూ.లక్ష రావాల్సి ఉండగా, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేలు శనివారం మృతుడి భార్య అంజమ్మకి అందజేశారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉండటంతో వారికి ఆసరాగా ఉంటుందన్నారు. వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రంగనాథన్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ శాస్త్ర పితామహుడు, పద్మశ్రీ డాక్టర్ షియాలి రామామృత రంగనాథన్ 131వ జయంతి కార్యక్రమం ఏలూరులోని ఆర్‌ఆర్ పేటలో శనివారం నిర్వహించారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.వి.వెంకటేశ్వరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో గ్రంథాలయ శాస్త్ర అభివృద్ధికి, గ్రంథాలయాల ఏర్పాటు వాటి నిర్వహణ, పురోభివృద్ధికి ఎన్నో విధాలుగా కృషి చేసిన రచయిత, విద్యావేత్త, గణిత శాస్త్రజ్ఞుడు, ప్రముఖ లైబ్రేరియన్ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ అని కొనియాడారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘ కాలం పనిచేయటమే కాకుండా దేశంలో పలు విశ్వవిద్యాలయాలలో వారు విశేష సేవలు అందించారని, రచయితగా రెండు వేలకు పైగా వ్యాసాలు వ్రాయడమే కాకుండా, 60పుస్తకాలు ముద్రించడం, 5 అంతర్జాతీయ జర్నల్స్‌కు ఎడిటర్‌గా పనిచేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గరికపాటి కాళిదాస్, పరిమి సావిత్రి, డి.హేమసుందర్, గురుశర్మ పాల్గొన్నారు.

## 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ముదినేపల్లి :విజయవాడ అను గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ వారి సహకారంతో స్థానిక శ్రీకృష్ణ మెడికల్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో గుండె సంబంధిత వ్యాధులు, నరాలు, ప్రసూతి స్త్రీ గైనకాలజీ విభాగాలకు చెందిన పలువురు డాక్టర్లు శిబిరంలో పాల్గొని రోగులకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమార పెదబాబు, రాజా, సౌమ్య పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుక్కను తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన ఘటన శనివారం రౌతుగూడెం సమీపంలో రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములగళంపల్లి గ్రామానికి చెందిన మరీదు శ్రీను, లక్ష్మి ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వస్తుండగా రౌతుగూడెం వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో, ద్విచక్ర వాహనం అదుపు తప్పి పల్టీ కొట్టడంతో ఇద్దరికీ గాయలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జీలుగుమిల్లి పిహెచ్‌సికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

### ద్విచక్రవాహనాలు ఢీ : వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - మండవల్లి

ద్విచక్ర వాహనాలు ఢీ కొని ఒక వ్యక్తి దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని చావులపాడు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇంగిలం పాక గ్రామానికి చెందిన మోరు దావీదు రాజు తన ద్విచక్ర వాహనంపై మరొక వ్యక్తిని ఎక్కించుకుని కైకలూరు నుంచి ఇంగిలంపాకలంక బయలుదేరాడు. చావలపాడు వద్దకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న మరొక ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో దావీదు రాజు ద్విచక్ర వాహనం రోడ్డుపై పల్టీ కొట్టి జారుకుంటూ వస్తూ మండవల్లి వైపు నుంచి కైకలూరు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొంది. సంఘటనలో మోరు దావీదు రాజు తలకు తీవ్ర గాయమై, తీవ్రంగా రక్తస్రావం కావడంతో దావీదురాజు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరొక వ్యక్తి విజయ్ తలకు, కంటికి గాయాలు కాగా, ఇంకొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో జాతీయ రహదారికి ఇరువైపులా భారీ స్థాయిలో వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వైద్య నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### నకిలీ నోట్ల కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నకిలీ నోట్లు ఆశ చూపి దోపిడీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని జంగారెడ్డిగూడెం డిఎస్‌పి ఎం.ధనుంజయుడు తెలిపారు. శనివారం స్థానిక సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులు నుంచి స్వాధీన పరుచుకున్న నగదు, నకిలీ నోట్లు, వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి ఎం.ధనుంజయుడు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక శ్రీనివాస్ పురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఎస్ఐ సాగర్ బాబు పోలీస్ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా దోపిడీదారులైన కోడూరు రవితేజ, షేక్ నాగుల్ మీరా వలీలు వస్తున్న కారును ఆపి తనిఖీ చేయగా రూ.39 లక్షల 36 వేల 300 నగదు, రూ.10 లక్షలు నకిలీ నోట్లను గుర్తించినట్లు తెలిపారు. దీంతో కోడూరి రవితేజ, షేక్ నాగుల్ మీరావలీలతో పాటు ఒక కారును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన విచారణలో వీరిద్దరూ ఒక లక్ష అసలు కరెన్సీకి మూడు లక్షలు నకిలీ కరెన్సీ నోట్లు ఇస్తామని అమాయకులకు ఆశ చూపి వారి వద్ద ఉన్న అసలు కరెన్సీ నోట్లను దోపిడీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజేష్, ఎస్ఐ సాగర్ బాబు, సిబ్బంది స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ రాజు, పోలీస్ కానిస్టేబుల్ సిహెచ్ సత్యనారాయణ, హోంగార్డ్ ఎం.సతీష్ పాల్గొన్నారు.



## సాధారణ ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కోసం కృషి

### పాఠశాల ఎస్‌పిఎల్‌గా 9వ తరగతి విద్యార్థులు రుత్విక్, శ్రీనిధి

ప్రజాశక్తి - భీమడోలు



ఎన్నికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

భీమడోలు శ్రీచైతన్య పాఠశాల ఎస్‌పిఎల్‌గా 9వ తరగతి విద్యార్థులు జి.రుత్విక్(బాలురు), ఇరగవరపు శ్రీనిధి(బాలికలు) ఎన్నికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.సోహిని తెలిపారు. ఈ మేరకు నిర్వహించిన ఎన్నికలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చీఫ్ ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు సాధారణ ఎన్నికలను పరిచయం చేసే విధంగా ఎన్నికల ప్రక్రియ చేపట్టామన్నారు. ఇదే క్రమంలో పదవుల కేటాయింపులో బాలురు, బాలికలకు సమాన ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. ఎన్నికల విషయానికొస్తే ఒకటి నుంచి తొమ్మిదవ తరగతి వరకూ కొనసాగుతున్నాయన్నారు. 9వ తరగతి విద్యార్థులకు ఎస్‌పిఎల్, ఎనిమిదవ తరగతి విద్యార్థులకు డిప్యూటీ ఎస్‌పిఎల్ పదవులను ప్రత్యేకించామన్నారు. 9వ తరగతి నుంచి నలుగురు, ఎనిమిదవ తరగతి నుంచి నలుగురుతో పాటు ఒక స్వతంత్ర అభ్యర్థిగా ఎనిమిదవ తరగతి విద్యార్థి పోటీ చేశారన్నారు. సాధారణ ఎన్నికల తరహాలోనే ఓటర్ లిస్ట్ ప్రకటన, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ సందర్భంగా గుర్తింపు కోసం ఓటరుకు ఇంక్ మార్కు వేయుట, రహస్య ఓటింగ్ నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ వినియోగం వంటి కార్యక్రమాలను చేపట్టామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు వేరు, వేరుగా గుర్తులు కేటాయింపు చేశామన్నారు. ఇదే క్రమంలో ఎన్నికల ప్రచారం కోసం రంగంలో ఉన్న అభ్యర్థులకు తగు సమయాన్ని కేటాయించామన్నారు. ఆ తరువాత ఉపాధ్యాయుల పర్యవేక్షణ, నిఘాల మధ్య పోలింగ్ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తైన తర్వాత గెలుపొందిన అభ్యర్థుల వివరాలు ప్రకటించామన్నారు. డిప్యూటీ ఎస్‌పిఎల్‌గా ఎనిమిదవ తరగతి విద్యార్థి ఎస్.దినేష్ కుమార్(బాలురు), అల్లూరి ప్రణవి చౌదరి(బాలికలు) ఎన్నికయ్యారని తెలిపారు. ఎస్‌పిఎల్‌తో పాటు డిప్యూటీ ఎస్‌పిఎల్‌గా గెలుపొందిన విద్యార్థులను అకాడమిక్ డీన్ వి.భార్గవ కిరణ్, ఎఒ ముఖేష్ కుమార్‌తో పాటు పాఠశాలకు చెందిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

## విఐటిలో నారాయణపురం కళాశాల విద్యార్థికి సీటు



హేమలత..

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023లో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థిని కుంటి హేమలత వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విఐటి) డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ సీటు సాధించినట్లు నారాయణపురం కళాశాల ప్రిన్సిపల్ బివి శ్రీనివాస్ తెలిపారు. హేమలత నారాయణపురం కాలేజీలో ఎంపిసి గ్రూపులో 1000/931 మార్కులు సాధించి జిల్లాస్థాయి బ్రిలియంట్ అవార్డు తీసుకుంది. ఈ క్రమంలో ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన కారణంగా విఐటిలో నాలుగేళ్లపాటు ఉచితంగా హాస్టల్ వసతి కల్పించి ఇంజనీరింగ్ విద్యను చదివేందుకు అవకాశం కల్పిస్తూ హేమలతను ఎంపిక చేశారు. ఈనెల 17న అమరావతిలో సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. హేమలత తల్లిదండ్రులు నారాయణపురంలో వ్యవసాయ కూలీలు. కష్టపడి మంచి మార్కులు సాధించి ఏలూరు జిల్లా నుంచి హేమలత ఒక్కరే విఐటికి ఎంపి కావటం పట్ల డివిఇఒ ప్రభాకర్రావు అభినందించారు.

## వికలాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు



వికలాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న ప్రముఖులు..

గుండుగొలను కేంద్రంగా పనిచేస్తున్న శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి తమ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా శనివారం గ్రామపంచాయతీ పరిధిలోని సుమారు 60మంది వికలాంగులకు నిత్యావసరాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ మేరకు దీనికి అవసరమైన రూ.25వేల విరాళాన్ని గ్రామానికి చెందిన దాతలు కొనగళ్ల మోహనరావు, కొనగళ్ల అనంత్ సమకూర్చారు. పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ రామవరప్పాడు కేంద్రంగా పనిచేసే తెల్లి క్లీనిక్‌కు చెందిన గుండె, ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్, డాక్టర్ భానురేఖ వికలాంగులకు అందజేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సదరు డాక్టర్ దంపతులు స్థానిక వికలాంగుల సంక్షేమానికి ప్రతి నెలా వైద్య శిబిరం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. సేవా సమితి అభ్యున్నతికి తమ వంతు సహాయ సహకారాలను పలు రూపాల్లో అందజేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐ చావా సురేష్, సామాజిక కార్యకర్త టి.సుమన్ బాబు, ప్రముఖులు పాల్గొన్నారు.

## 'డోర్ టు డోర్' త్వరితగతిన పూర్తి చేయాలి : ఆర్‌డిఒ



పెదపాడు సమీక్షలో మాట్లాడుతున్న జివివి సత్యనారాయణ..

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఓటర్ జాబితా సవరణలో భాగంగా డోర్ టు డోర్ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీ రాణి తెలిపారు. ఓటరు సవరణ జాబితాపై శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ జాబితా సవరణకు సంబంధించి డోర్ టు డోర్ సర్వేను ఈ నెల 21 లోపు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. అదే విధంగా వెరిఫికేషన్‌కు వెళ్లినప్పుడు బిఎల్‌ఒలు, బిఎల్‌ఎలను వెంట తీసుకుని వెళ్లవచ్చని తెలిపారు. బిఎల్‌ఒలు వెంట వాలంటీర్స్‌గాని, ఇతరులుగాని తీసుకెళ్లరాదని తెలిపారు. ఫారం 6, 7, 8పై పూర్తి అవగాహన కల్గి ఉండాలని, ప్రతిదానికి తప్పనిసరిగా డాక్యుమెంట్‌ను బిఎల్‌ఒ దగ్గర పెట్టుకోవలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరినీ గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్ సింగ్, ఎలక్షన్ సూపర్‌వైజర్‌లు రమణ, పోసమ్మ, పండు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పెదపాడు:** పెదపాడు ఎండిఒ ఆఫీస్ నందు డోర్ టూ డోర్ ఓటర్స్ వెరిఫికేషన్ కార్యక్రమంపై జివివి సత్యనారాయణ, ఇఆర్‌ఒ, డివై కలెక్టర్ కెఆర్‌సిసి ఏలూరు వారు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో బిఎల్‌ఒలకు డోర్ టూ డోర్ ఓటర్స్ వెరిఫికేషన్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై తగు సూచనలు తెలియజేశారు. ఈనెల 21వ తేదీ నాటికి పూర్తి చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెదపాడు తహశీల్దార్ జి.విజయకుమార్ రాజు, డివై తహశీల్దార్ ఎన్‌డివి ప్రసాద్‌బాబు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : డిఎన్ఆర్

**ముదినేపల్లి:** గ్రామాలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరరావు తెలిపారు. శనివారం ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీలో రూ.9.24 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సచివాలయాల పరిధిలో గడప గడపకు రూ.లక్ష నిధులతో సీసీ రోడ్లు, రూ.25 లక్షలతో గ్రామంలో డ్రెయినేజీల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సత్యనారాయణ, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణపురం కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

### రాజకీయ నాయకులు సామాజికాభివృద్ధికి ఆలోచనలు చేయాలి

### యువత పరిశోధనల వైపు దృష్టి సారించాలి

### ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్




మాట్లాడుతున్న కమిషనర్ పోలా భాస్కర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. పూర్వ విద్యార్థులు కోనా శ్రీనివాసరావు వితరణ చేసిన అరవింద గోష్ విగ్రహాన్ని, పైలాన్ స్తూపాన్ని ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ ముఖ్య అతిథిగా ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ వాసు బాబు ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎల్ఎ వాసు బాబు మాట్లాడుతూ ఆనాడు చింతలపాటి మూర్తి రాజు ముందు చూపుతో గ్రామీణ ప్రాంతానికి విద్యను అందించాలని నారాయణపురం సువిశాల ప్రాంగణంలో కాలేజీ స్థాపించారని కొనియాడారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అనేక వసతులతో కూడిన భవనంలో డిగ్రీ క్లాసులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆజాదికా అమృత్సవంలో భాగంగా అరవింద్ 150వ జయంతి వేడుకలను ప్రారంభించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు వారి వారి బాధ్యతలతో పాటుగా సామాజిక అభివృద్ధి కోసం ఆలోచనలు చేయాలని అన్నారు. స్వాతంత్య్రం అనంతరం విద్యకు అధిక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. నేటికీ కళాశాల విద్యలో పలు అంశాల్లో మనం ఇంకా వెనుకబడే ఉన్నామని దాన్ని అధిగమించేందుకు అనేక కొత్త కొత్త ప్రయోగాలు, విధానాలను అమలు చేస్తున్నామన్నారు. యువత సాంప్రదాయ కోర్సుల కంటే బయోటెక్, ఫార్మా, అటానమిక్, అగ్రికల్చర్ తదితర పరిశోధన(రీసెర్చ్) రంగాలవైపు మళ్లేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే ముందుగా 18 నుంచి 22 ఏళ్ల వారిని డిగ్రీలో చేరేలా ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి సిహెచ్ కృష్ణ, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, కాలేజీ అభివృద్ధి ప్రణాళిక సంఘం కన్వీనర్ సీతారామాంజనేయ రాజు, నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యురాలు, కోరిపల్లి జయలక్ష్మి, మాజీ ఎఎంసి ఛైర్మన్, సొసైటీ ఛైర్మన్ మరడ రమావతీ, చేబ్రోలు సర్పంచి రాందే లక్ష్మి సునీత పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న కమిషనర్ భాస్కర్

## వివాదాస్పద అల్లంచర్ల అటవీ భూముల్లో ఉద్రిక్తత

### రెండు గ్రూపుల మధ్య కొట్లాట

### సర్పంచితో పాటు పలువురికి గాయాలు

### పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల, కొత్తగూడెం వివాదాస్పద అటవీభూముల్లో మళ్లీ ఉద్రిక్తత నెలకొంది. సర్వే నెంబరు 226, 227లో ఉన్న సుమారు 3వేల 2వందల ఎకరాలకు సంబంధించి భూముల వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. గత కొంతకాలంగా అటవీ భూముల్లో జరుగుతున్న వివాదాల నేపథ్యంలో శనివారం సర్వే నెంబరు 227లో గుడివాడకు చెందిన కాసననేని చంద్రశేఖర్ అనే వ్యక్తి హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని సుమారు 570 ఎకరాలు తనదేనని చెబుతున్నాడు. శనివారం కొందరితో ఆభూముల్లో చెట్లు నరికించి, తుప్పలు బాగుచేయించి జీడి మొక్కలు పెడుతుండగా స్థానిక సర్పంచి నార్ని వెంకట్రావు, మరికొందరితో పాటు కామవరపుకోట మండలంలోని గుంటుపల్లి, కంఠ మనేనివారిగూడెం భూముల సరిహద్దు గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వందల మంది అటవీ భూముల్లోకి చేరుకుని మొక్కలు వేసే పనులను అడ్డుకున్నారు. ఈ భూముల్లో మాకు సంబంధం ఉందని అటవీ బాగు చేయడానికి ఉపక్రమించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈక్రమంలో ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకోవడంతో సర్పంచితో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరావు, టి.నరసాపురం, జీలుగుమిల్లి ఎస్ఐలు కె.సతీష్ కుమార్, చంద్రశేఖర్, రెవిన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గొడవను అదుపు చేసి ఇరు వర్గాలతో చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు శీలం వెంకటేశ్వరావు, జయవరపు శ్రీరామమూర్తి, మండల టిడిపి నాయకులు భూ వివాదంపై తహశీల్దార్ జెవి సుబ్బారావు, పోలీసులను నిలదీశారు. అల్లంచర్ల అటవీ భూములు ఎవరివి, రెవెన్యూ, పారెస్ట్‌కు చెందినవా లేక రైతులవా తేల్చి చెప్పాలన్నారు. గుడివాడకు చెందిన కొందరు వ్యక్తులు భూములు ఆక్రమించి, దర్జాగా విలువైన చెట్లు నరికించి విక్రయాలు చేస్తున్నా పారెస్ట్, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పారెస్ట్ అధికారులు కోట్ల రూపాయలు ముడుపులు తీసుకుని వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు. దీంతో స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ 226, 227 భూముల్లో సర్వే చెయ్యని భూములు ఉన్నాయన్నారు. దీంతో ఆ భూముల విషయంలో కోర్టులో వివాదం నడుస్తుందన్నారు. సర్వే జరిగితే తప్ప ఆ భూములు ఎవరికి చెందుతాయే తేల్చలేమన్నారు. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని, వారి ఆదేశాల మేరకు భూములు సర్వే నిర్వహిస్తామని తెలిపారు. అప్పటి వరకూ వివాదాస్పద భూముల్లోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు.



తహశీల్దార్, పోలీసులను ప్రశ్నిస్తున్న నాయకులు



గాయపడిన సర్పంచి



సంఘటనా స్థలంలో గొడవకు దిగిన వారు..

## చినవెంకన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల చిన్న వెంకన్నను హైకోర్టు జడ్జి శేష సాయి కుటుంబ సమేతంగా శనివారం ఉదయం దర్శించుకున్నారు. మొదట ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారు, అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వాదం తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి స్వామి వారి శేష వస్త్రంతో జడ్జిను సత్కరించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేశారు.

## నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలని తల్లిదండ్రులు వార్డెన్‌ను కోరారు. శనివారం మండల కేంద్రమైన ముసునూరు బిసి బాయ్స్ హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ షేక్ నాజీర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందిలు కలగకుండా చూసుకుంటున్నామన్నారు. తమ పిల్లలను అడిగి తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో డిఎస్‌పి ఈడే అశోక్ కుమార్ గౌడ్ శనివారం క్రెయిమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించాలని, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే పలు గ్రామాల్లో త్వరలో జరగనున్న వార్డు సభ్యుల ఉప ఎన్నిక సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు.

## ఇ-క్రాప్ తప్పనిసరి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రైతులు తమ సాగు చేసిన పంటను ఇ-క్రాప్ ద్వారా బుక్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారిని ఎ.చాముండేశ్వరి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో జియో ఫెన్సింగ్ ఆధారిత విధానంలో ఇ-క్రాప్ బుకింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఇ-క్రాప్ బుకింగ్ చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సూచించారు.

## రామారావుకు ఆకుమర్తి పరామర్శ

### రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న పంగిడిగూడెం మాజీ సర్పంచి గంటారామరావుని టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి అకుమర్తి రామరావు పరామర్శించారు. శనివారం విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గంటా రామారావును కలిసిన అకుమర్తి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.